# కల్యాణమూర్తి

కాళింది మొగుడు విజయరామారావు ప్రయోజకుడు కాదని అందరూ గుర్తించారు. కాని ఎవరూ అలాగని పైకి చెప్పరు. అతను ఏ సందర్భంగానైనా ఎదురై కన్పించినపుడు చాల గౌరవంగా పలకరిస్తారు. లోకరీతి గురించిన తన అభిప్రాయాలు ప్రకటిస్తున్నపుడు శ్రద్ధగా వింటారు కాని...

అసలు విషయం కాళిందికి అర్థం కావటానికి చాల రోజులు పట్టింది.

ప్రయోజకత్వం అంటే ఏమిటో అందరికీ తెలుసు - పుష్కలంగా డబ్బు సంపాదించటం! నాగరికత వృద్ధిపొంది మానవ సమాజం మరింత సంకీర్ణంగా అల్లుకుపోతున్నకొద్దీ వ్యక్తి సత్తాను నిర్ణయించే ఏకైక విలువగా రూపొందింది డబ్బు. వ్యక్తిని గురించి సమాజానికి కావలసిన సమాచారం అదొక్కటే. మిగతా విలువల గురించి పట్టించుకోవటం మానేసి చాలకాలమైంది. కాబట్టి వ్యక్తి సమాజం చేత గుర్తింపబడాలంటే అతనికి కావలసింది డబ్బు. 'డబ్బు లేనివాడు డుబ్బుకు కొరగాడు'. ఈ విషయమై కాళింది పుట్టింటికి వచ్చినప్పుడు చర్చలూ, వాదోపవాదాలూ జరుగుతూ ఉండేవి. జీవితాన్ని గురించి తనకున్న అస్పష్టమైన అవగాహనతో తృప్తిపడి ఈ వాదనల గురించి ఎక్కువగా పట్టించుకోలేదు కాళింది. 'వాళ్ళకేం తెలుసు, పాపం!' అనుకునేది ఉదారంగా...

ఇప్పుడు పుట్టింట్లో ఆమె తల్లి కాంతమ్మగారు ఒక్కర్తే వుంటున్నది. తమ్ముడూ, చెల్లెలూ కాళిందికి లాగానే రెక్కలు వచ్చి బయటి ప్రపంచంలోకి ఎగిరిపోయారు.

తల్లిని చూసిపోవడానికని వచ్చింది కాళింది. ఇలా వచ్చినపుడు వున్న కొద్ది సమయంలోనూ పిచ్చాపాటీ చాలా మాట్లాడుకుంటారు వాళ్లు. కాంతమ్మగారు చేటలో బియ్యం పోసుకుని బెడ్డలు ఏరుతూ కూర్చుంది. కాళింది మంచం మీద పడుకుని చదువుతున్న పుస్తకం ప్రక్కన పెట్టింది. తమ్ముడి మీద, చెల్లెలి మీదా తనకున్న అసంతృప్తిని తల్లితో చెప్పాలనుకున్నది. "వాడికి నేను మూడుత్తరాలు వ్రాశాను. ఎప్పుడో సంవత్సరానికోసారి గ్రీటింగ్ కార్డు పంపడం తప్ప సమాధానం వ్రాయడు. అమ్మా, వాడికి సోమరితనం ఎక్కువైంది!" అన్నది. తల్లి ఊకొట్టి వూరుకొన్నది. కాళింది కోపంగా అన్నది:

"పోనీ రాజీకేమైంది? అదీ వ్రాయదు! గట్టిగా అడిగితే అన్నయ్యకైతే ఎప్పుడనుకుంటే అప్పుడు కాల్ చేస్తాను, నీవూ ఫోన్ పెట్టించుకో, అక్కా! లెటర్సు వ్రాయటం బోరు! అన్నది. ఏమి వేషాలు పోతున్నారమ్మా! అందరం ఈ యింట్లో పుట్టిన పిల్లలమేనా? వాళ్ళ వేషాలు చూడు, ఎట్లాగున్నవో!" అంటూ తనలోనున్న అసంతృప్తినంతా వెళ్ళగ్రక్కింది.

కాంతమ్మ కొంచెంసేపు వూరుకుండిపోయింది. కానీ చెప్పక తప్పదన్నట్లుగా నయంగా బోధిస్తున్న స్వరంతో చెప్పింది: "నీవు పేదదానివని నిన్ను వాళ్ళు లెఖ్ఖ చెయ్యరు!" అన్నది. విషయాన్ని కుండబ్రద్దలు కొట్టినట్లు చెప్పడం ఆమె స్వభావం. కాసేపుండి మళ్ళీ అన్నది : "నాకూ నీ గురించినదే చింత!... నీ కొడుకైనా ప్రయోజకుడై వుంటే బాగుండేది... డబ్బుతో పాటుగా వచ్చే అలవాట్లూ, మనస్తత్వాలూ వుంటవి. అది లోకరీతి. వాళ్లని తప్పు పట్టనక్కరలేదు!" అన్నది.

కాళిందికి తాను విన్నదేమిటో మొదట అర్థం కాలేదు. నెత్తి మీద సుత్తి దెబ్బ తిన్న మనిషిలాగా అయిపోయింది. క్రమంగా అర్థం చేసుకున్నాక మాటలన్నీ యింకిపోయినట్లు మౌనంగా వుండిపోయింది. శివుడు హాలాహలాన్ని మ్రింగినట్లు ఆవేశాన్ని తనలోకే అణిచివేసుకున్నది.

మెల్లగా పుస్తకం చేతిలోకి తీసుకున్నది అందులోని విషయం బుర్రకెక్కడం మానేసింది. మనసు నిండుగా ముసురుకొస్తున్న జ్ఞాపకాలు... తమ్ముడు రవికీ, చెల్లెలు రాజీకి తాను కథలు చెప్పింది. చదువు నేర్పింది. సందేహాలు తీర్చింది. తాము ముగ్గురూ కలిసి గడిపిన జీవితం తాలూకు మధురమైన బాల్యస్మృతులు ఎన్నో వున్నవి! ఆ ఆత్మీయతనే గుర్తుంచుకున్నది తాను. తర్వాత ఎంతోకాలం గడిచింది. తమ జీవిత మార్గాలు వేరైపోయి, ఎన్నో మార్పులు వచ్చిన విషయం తాను గుర్తించలేదేమో! జీవితంలో ఏర్పడే బంధాలకూ, అనుబంధాలకూ కేంద్రంగా వుండే 'నేను' డబ్బుకు లోబడి వుండే స్వార్థప్రయోజనమేనంటే కాళిందికి నమ్మశక్యం కావటంలేదు. అయినా ఒకవైపున తోబుట్టువుల ప్రవర్తనా, మరోవైపున కొడుకు శశిబాబు భవిష్యత్తూ ఆమెను 'ఇప్పుడు చెప్పు!' అని నిలదీస్తున్నవి.

కాళింది తిరిగి వెళ్ళటానికి బయల్దేరుతుంటే కాంతమ్మగారు రెండు వంద రూపాయల నోట్లు తెచ్చి కూతురి చేతిలో పెట్టి "చీర కొనుక్కోమ్మా!" అన్నది. ఆ డబ్బును చూస్తే కాళిందికి దానిని విసిరి నేలకేసి కొట్టాలన్న ఆవేశం వచ్చింది. ఆ డబ్బు తనకిస్తూ అమ్మ తనని అవమానిస్తున్నట్లనిపించింది. కాని ఆవేశాన్ని దిగమ్రింగుకుని డబ్బు పర్సులో పెట్టుకుంది. తాను యిక్కడికి వచ్చిన ప్రతిసారీ ఆమె అలానే యిస్తుంది. ఈసారి దాన్ని

త్రిప్పికొట్టి తాను వ్యర్థంగా బయటపడిపోవడమే తప్ప సాధించేదేమీ వుండదు!

తాను క్రొత్తగా గుర్తించిన చేదు నిజాన్ని కడుపులో దాచుకుని, మనసులో నిరాశ నింపుకుని, తన యింటికి తిరిగివెళ్ళింది కాళింది.

## 2

విజయరామారావు స్కూలు నుండి యింటికి రాగానే కాళిందితో చెప్పాడు : "శ్యామల్రావు ఫోన్ చేశాడు. రాజయ్యా, తనూ వస్తారుట ఆరు గంటలకు" అని. వాళ్ళిద్దరూ విజయరామారావుకు కాలేజీలో సహాధ్యాయులు. అప్పట్లో రాజయ్యా, శ్యామల్రావూ ప్రక్కనున్న ఒక పల్లెటూరి నుండి చదువు కోసం గుంటూరు వచ్చి గది అద్దెకు తీసుకుని వుండేవాళ్ళు. వాళ్ళ గదికి దగ్గర్లోనే విజయరామారావు యిల్లుండేది. ముగ్గురూ క్లాసులో ఒక బెంచీలోనే కూర్చునేవాళ్ళు. విజయరామారావూ, శ్యామల్రావూ చదువులో గట్టివాళ్ళు. రాజయ్య అత్తెసరు మార్కులతో పాసయ్యే బాపతు. ఆ కాలంలో విజయరామారావుని బాగా అభిమానించి వెనుక వెనుకనే తిరిగేవాడు. రాను రాను వాళ్ళ దోవలు వేరైపోయినై. రాజయ్య రాజకీయాల్లో తిరిగి యం.ఎల్.ఎ. అయిపోయి ప్రయోజకుడైపోయాడు. శ్యామల్రావు ఆటోమొబైల్స్ సేల్స్ బిజినెస్‌తో ప్రారంభించి ప్రయోజకుడైనాడు. వాళ్ళిద్దరూ కలిసి పట్టణ ప్రాంతాల భూములు చౌకలో కొనేసి, యిళ్ళ స్థలాలుగా మార్చి అమ్మటంలో ఉమ్మడిగా కోటి రూపాయల వరకూ ఆర్జించారు. విజయరామారావు ఆ వూళ్ళో హైస్కూలు టీచరుగా చేరి, ఉత్తమ ఉపాధ్యాయుడుగా పేరు గడించి హెడ్మాస్టరు అయ్యాడు. యిల్లు గడవడానికి సరిపడే జీతంతో సాదాగా బ్రతుకుతూ వుండిపోయాడు. అయినా యిప్పటికీ రాజయ్య తన నియోజకవర్గానికి వచ్చినపుడు ముగ్గురు మిత్రులూ విజయరామారావు యింటి దగ్గర కలుసుకుంటూ వుంటారు.

రాజయ్య యిలా అప్పుడప్పుడూ విజయరామారావును చూడరావటం కాళిందికి అర్థం కాని విషయం. వాళ్లు వస్తున్నారనగానే 'ఎందుకట?' అని తీవ్రంగా అనబోయిన కాళింది ఏదో ఆలోచన తట్టి చప్పబడిపోయింది. "మన శశిబాబుకు యీసారి సర్వీస్ కమిషన్ సెలక్షన్ రాకపోతే ఏజ్‌బార్ అయిపోతుంది. యం.కాం. ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యాడు. వాడి తెలివితేటలకు న్యాయమైన పద్ధతి వుండి వుంటే ఈసరికెప్పుడో మంచి ఉద్యోగం దొరికి ఉండాల్సింది... మీరు ఈసారి ఆ రాజయ్యగారితో ఒక్కమాట చెప్పి వుంచండి. ఒకరికొకరు సహాయం చేసుకోలేకపోతే యిహ ఆ స్నేహాలెందుకు?" అన్నది అనునయంగా.

భర్త 'చూద్దాంలే' అనటం ఆమెకు చాలా ఉత్సాహాన్నిచ్చింది. అతను కాఫీలు పంపమని చెప్పకపోయినా ఆ సన్నాహంలో పడిందామె. కొన్ని రోజుల క్రితం ఎవరో వచ్చినపుడు కాఫీ పంపమని చెప్పాడతను. "మీరు గీచి గీచి లెఖ్ఖగా చాలీ చాలకుండా

యిస్తుండే డబ్బుతో ఈ కుటుంబానికి ఆరోగ్యకరమైన ఆహారం యివ్వాల్సిన బాధ్యత నాకున్నదనుకుంటున్నాను. నా మొహానికి బాధ్యతలు చాలా వున్నై. తీర్చే మార్గమే లేదు!... ఆ చాలీ చాలని సంపాదనలో నుంచీ యీ మర్యాదలూ, మొహమాటాలూ ఎలా చెల్లిస్తారు?" అన్నదామె విసురుగా. అతను కాసేపు ఆలోచించి, "అయితే పాలు లేవా?" అన్నాడు. ఎందుకుండవూ? మధ్యతరగతి గృహిణి ఉపాయాల పుట్ట. వచ్చినవాళ్ళకు కాఫీ యిచ్చి మర్నాడు మజ్జిగను నీళ్ళు చేసెయ్యొచ్చు. 'నాకెందుకో పైత్యంగా ఉన్నట్లుంది - యివాళ కాఫీ తాగను. జలుబు కూడా చేసినట్టుంది. ఇది శీతపైత్యం! మజ్జిగ కూడా అఖ్ఖర్లేదు' అనొచ్చు. మరీ అవసరమైతే చిన్నవాడితో "ఒరేయ్ బుజ్జీ యివాళ నువ్వు చెప్పిన మాట విన్నావు గనుక నీకు పాలకు బదులు చిక్కగా టీ యిస్తాను" అని ఔదార్యం చూపొచ్చు! ఎన్ని ఉపాయాలో ఉన్నవి. కాని కాళింది ఆనాడు అక్కను కొద్దీ అలా అన్నది... అప్పటినుండీ ఎవరైనా వచ్చినపుడు కాఫీ పంపమని చెప్పడానికి అతను సందేహిస్తున్నాడు...

మిత్రులు ముగ్గురూ కూర్చుంటే ఎన్నో విషయాలు చర్చకొస్తాయి. "ఏమిటో మనిషి పుడతాడు. చస్తాడు. మరుపు తెరల మాటున మాయమై పోతాడు... ఏం సాధించినట్లు? ఎందుకు బ్రతికినట్లు? మనిషి జీవితానికి ఏమి విలువ వున్నట్లు?... ఈమధ్య వూరికే కూర్చోవాలంటే భయం. యిట్టాంటి ఆలోచనలే మనసుని దొలిచేస్తున్నవయ్యా!" అన్నాడు రాజయ్య.

"యాభై యేళ్ళకే అంత వైరాగ్యం అఖ్ఖరలేదు! ఏ డెభ్భై ఏళ్ళో వచ్చినప్పుడు ఆలోచిద్దాం... ఇప్పటికి ఆ మంత్రి పదవి చేజిక్కించుకుని మరింతగా ప్రజాసేవ చేసే 'అవకాశం గురించి ఆలోచించు" అన్నాడు శ్యామల్రావు నవ్వుతూ.

ఇదివరలో మంత్రి పదవుల పంపిణీలు జరుగుతున్నప్పుడు రెండుసార్లు రాజయ్య పేరు పత్రికల్లో విన్పించింది. ఒకసారి కార్పొరేషన్ పదవి దొరికిందిగాని మంత్రిగా ప్రజాసేవ ఇతోధికంగా చేసే భాగ్యం దొరకలేదు యింతవరకూ. ఆ విషయంలో అతనికి కొంత అసంతృప్తి వున్నది.

"ప్రజాస్వామ్యానికీ, సంఘజీవిగా మనిషి మనుగడలోని తృప్తికీ మూలస్తంభం 'సమానావకాశం' అన్నది. దాన్ని న్యాయమైన పద్ధతిలో అందుకునే అవకాశం అందరికీ ఉండాలి. అది లేనప్పుడు ప్రజాస్వామ్యం కాస్తా దోపిడీ వ్యవస్థగా మారిపోతుంది. పదవి అంటే తనకూ, తన కుటుంబానికీ, తన కులానికీ సాధ్యమైనన్ని అవకాశాలు మూటగట్టుకునే వెసులుబాటు అవుతుంది. అది గుమాస్తా పని అయినా, ఆఫీసరు పని అయినా, మంత్రి పదవి అయినా అంతే అవుతుంది. పదవి పెద్దదైన కొద్దీ వాళ్ళ వలన

ప్రజాస్వామ్యానికి జరిగే అపకారమూ పెద్దదే!... కాబట్టి చాలా చాలా పెద్ద పదవుల్లో వుండే వాళ్ళు స్థావరాలు కాకూడదు! జంగమాలు కావాలి! ఏ మంత్రిగాని ఐదేళ్ళకు మించి పదవిలో ఉండకూడదు!" ఆవేశంగా బల్లగుద్ది మరీ చెప్పాడు రాజయ్య. ప్రజాస్వామ్యానికి మూలం రాజయ్య మంత్రి పదవి దగ్గరకు వచ్చి ఆగింది.

ఇదంతా విజయరామారావు నవ్వుకుంటూ తలూపుతూ విన్నాడు. రాజయ్య ఇదివరలో ఏ విషయాన్ని గురించి గాని యింత ధారాళంగా మాట్లాడగలిగేవాడు కాదు. రాజకీయాల్లో రాణించే మెలకువలు కనుక్కున్నాడు! అనుకున్నాడు.

"ఇదిగో యిలాంటి ఉపన్యాసాలు ప్రజలకు చెప్పుకోవాల్సినవి. యిప్పుడు మనం చెయ్యవలసిందేమిటనేది మనం ఆలోచించుకోవాలి... అన్నిటికీ ఆ కల్యాణమూర్తి శ్రీ వేంకటేశ్వర స్వామి ఉన్నాడు. ఆయన తలుచుకుంటే కాని పని వుండదు... మంత్రి పదవి గట్టిగా కావాలనుకుంటే ఆయనకు ఏదో మంచి మొక్కుబడి చేసుకో. తరువాతి సంగతి ఆ కల్యాణమూర్తికి వదిలెయ్యి!" అని గట్టిగా సలహా యిచ్చాడు క్రియాశీలి శ్యామలావు.

"మీరు కోరినవన్నీ యిస్తే ఆ భగవంతుడు కల్యాణమూర్తి అయినట్లూ, లేకుంటే కానట్లునా?" అన్నాడు విజయరామారావు నవ్వుతూ.

"మరంతే గదా! మనకి మంచి జరగటమే కళ్యాణం!" అన్నాడు శ్యామలావు నిర్ద్వంద్వంగా. "బాగుంది. ఉన్నదికాస్తా మీకు దక్కితే, అది దక్కనివాళ్ళు ఆయన్నేమనాలి?" అని ప్రశ్న లేవదీశాడు విజయరామారావు.

"సరే, ఒప్పుకున్నాం. కల్యాణమూర్తి అంటే నీకు తెలిసిన అర్థం నీవు చెప్పు, చూద్దాం" అన్నాడు రాజయ్య.

"తన కోరికకు అనుగుణంగా వున్నా, లేకపోయినా అనుభవమన్నదే విలువైనది నా ఉద్దేశంలో. ఏ అనుభవం ఎదురైనా, దాని వెనుకనున్న మహాకారణాన్ని గుర్తించినప్పుడు ప్రతి అనుభవమూ కల్యాణం అవ్వొచ్చు!" అంటూ వివరించాడు విజయరామారావు.

కాళింది యిదంతా వింటూ విసుగ్గా వెనగ్గదిలో నిల్చున్నది. ఆ మానవుడు ఎంతసేపూ వేదాంతం మాట్లాడటమేగాని పిల్లవాడి సంగతి కదపనేలేదు! ఆమె ఉత్సాహం చల్లారిపోయింది. కోపం కూడా వచ్చింది.

లోపల కాళిందికి కలిగిన విసుగే బయట శ్యామలావుకీ కలిగినట్లుంది. అతనూ విసుక్కున్నాడు. "ఈ రాజయ్యకి పిల్లల బాదరబందీ లేదు, నీకు వేదాంతం ముదిరిపోయి ప్రాపంచిక విషయాలు పట్టడం మానేశాయి. నాకు మాత్రం బుర్ర నిండా పిల్లవాడికి కాలేజీలో సీటు ఎట్లా వస్తుంది, చదువయ్యాక ఉద్యోగం ఎట్లా సంపాదించి వాడిని

సంపాదనామార్గంలో ఎలా పెట్టాలి, అల్లుడికి ప్రమోషన్ ఎట్లా సాధించాలి అంటూ అన్నీ తాపత్రయాలే... మా అబ్బాయి చదువయ్యేసరికి మన రాజయ్య మంత్రి అయితే యిహ నాకు దిగుళ్ళే ఉండవు!" అన్నాడు.

"నాకు పిల్లల బాదరబందీ లేనిమాట నిజమే కాని తమ్ముడి కుటుంబ బాధ్యత తప్పదుగదా! సొంత అన్నది లేకపోయినా యోగి విశ్వకుటుంబీ కదండి. మావాడు ఈసారితో ఎట్లాగో బి.కాం. అయిందనిపించాడు. కమర్షియల్ టాక్సెస్‌లోగానీ, బ్యాంకు ఆఫీసరుగా గానీ కావాలంటున్నాడు..." అన్నాడు రాజయ్య.

"శేఖరేనా? అబ్బో, అసాధ్యుడయ్యా మీవాడు! గౌతమబుద్ధుని కంటే గొప్పవాడు! బుద్ధుడు సుఖంగా రాజభవనంలోనే వుండి అప్పుడప్పుడూ రథంమీద అడవికెళ్ళి, జ్ఞానం సంపాదించుకొనుండాల్సింది అన్నాడు కాదూ! ఉభయతారకంగా ఆలోచిస్తాడు! సరే, యీ ఏడాదికి అతని సంగతి చూడు. పై ఏడాదికి మా వాడిని గట్టెక్కించు!" అన్నాడు శ్యామల్రావు.

కాళింది యిహ వినడం మానేసింది. ఎదురుగా గోడ మీద దొంగజపం చేస్తున్నది దుక్కబల్లి. దాని చూపంతా పురుగు మీదే అయినా నిశ్చలంగా తపస్విలాగా నిలుచున్నది. ఆడుతూ, పాడుతూ నిర్భయంగా తిరుగుతున్నది రెక్కల పురుగు... అకస్మాత్తుగా దుక్కబల్లి కదిలింది. ఎక్కుపెట్టిన బాణంలా దూసుకెళ్ళి పురుగును నోట అందుకున్నది. మళ్ళీ తపస్సు - పురుగు కొట్టుకోవడం ఆగిపోయేవరకూ.... తాపీగా, రాజకీయ నాయకుడిలా హుందాగా నోరు మూడుసార్లు అప్పళించింది. ఇప్పుడు పురుగు లేదు. దుక్క బల్లి హడావిడిగా మరోచోటికి వెళ్ళిపోయి మళ్ళీ తపస్సు ప్రారంభించింది.

కాళింది కొడుక్కి ఉద్యోగం రాలేదు. రాజయ్య తమ్ముడి కొడుకు శేఖరానికి వచ్చింది. ఈవిషయం వినగానే కాళింది చూపు అభావమై కిటికీ బయటి దిక్కుకు మళ్ళింది. రోడ్డు మనుషులూ, చెట్లూ, మొక్కలూ, ఆకులూ చలనంలేని చిత్రపటం అయిపోయింది ఆమె స్తంభించిన మనసు ఎదుట. దాన్ని చూడకుండా చూస్తూ వుండిపోయింది మూఢురాలై.

విజయరామారావు స్కూలు నుండి రాగానే "ఆనాడు మీ స్నేహితులకు భగవంతుడు కల్యాణమూర్తి ఎలా అయ్యాడో వివరించారు గదా... ఆ కల్యాణానికి లోకంలో వుండే నీతి, ధర్మాలతో సంబంధం లేదా? నాక్కూడా కాస్త చెప్పండి. విని సంతోషిస్తాను!" అన్నది కాళింది తీవ్రంగా.

విజయరామారావు మందలింపుగా అన్నాడు, "చూడు కాళిందీ! దుఃఖం మనసుని ఏకోన్ముఖం చేసి జీవితపులోతునీ, వైశాల్యాన్నీ చూపిస్తుంది. నిరాశ అట్లాంటిది కాదు. అది ఫలితం మాత్రమే చూసే ద్వంద్వస్వరూపమైన మనసుకి సంబంధించినది. ఆశ,

నిరాశలూ, గెలుపు ఓటములూ, హెచ్చుతగ్గులూ - ఈ ద్వంద్వస్వభావం మనస్సుని పట్టి పీడించే భూతం! అక్కడ చిక్కుబడిన మనస్సు స్వేచ్ఛను పోగొట్టుకుంటుంది. నవ్వలేదు... నీవు నవ్వడం మరచిపోయి ఎంతకాలమైందో తెలుసా!... నీవనుకునే ప్రయోజకత్వానికీ, నవ్వుకీ నిజంగా సంబంధం వుంటే ఈ దేశంలో నూటికి డెబ్బై మందికి నవ్వు లేకపోగా ఊపిరి పీల్చే సాహసం కూడా వుండకూడదు. కాని విచిత్రమేమిటంటే మనస్ఫూర్తిగా నవ్వగలిగే శక్తి యింకా ప్రపంచంలో మిగిలి వుంటే అది అప్రయోజకుల దగ్గరే వుంది!

కల్యాణమూర్తి అన్నపదానికి అర్థం అడిగావు. కల్యాణం అన్న విషయానికి ఆ పదం వొక సూచిక మాత్రమే. ఆ పదంగానీ, దాని వివరణగానీ కల్యాణం కావు. అర్థం వొక సూటియైన, స్పష్టమైన ఎఱుకగా రావాలి. మనసు అందుకునే వివరణగా వచ్చినప్పుడు ద్వంద్వమూ, సందిగ్ధమూ ఏర్పడి వాదనలుగా దిగజారుతుంది.

'నేను' అన్న విషయం తీసుకో. నేను లోకంలోని అనేకుల్లో వొకడిని కాదు. నేను నేనే. నా స్వభావం నా ప్రత్యేకత. దానికనుగుణంగా ప్రవర్తిస్తేనే 'నేను' అవుతాను. లేకుంటే మూకలో వొకడిని. నేనుగా వుంటేనే నాకు సంతృప్తి లభిస్తుంది.

"భగవంతుడి కల్యాణగుణం గురించి ఎందుకు అడుగుతున్నావ్? అది వొక ఆనందపూర్ణత. ఆ గుణానికి, లోకంలో కనిపించే ప్రయోజనాలకీ ముడిపెడితే విషయం ఎంత వివరించినా అర్థం కాదు.

"శశి భవిష్యత్తు గురించి నాకు ఆదుర్దా లేదు. నాకు దేనిగురించీ ఆదుర్దా లేదు. నేను సరైన తండ్రిని కాదు గనుక అని నీవనుకుంటే, నేను చెప్పింది నీకు అర్థం కానట్లే..."

శ్రద్ధగా పాఠం బోధిస్తున్నట్లు చెప్పేడు విజయరామారావు.

అతనికి చెప్పగల ఘాటైన సమాధానాలు చాలా వున్నాయి ఆమె దగ్గర. అయినా అతను చెప్పిన దాన్లోని నిజమూ ఆమెను తాకింది. సందేహమెరుగని మనసులోనుంచి సందిగ్ధం లేకుండా వస్తున్న మాటల్లోని సూటిదనం ఆమెను తట్టిలేపింది.

...కానీ అతను చెపుతున్న ధర్మం శశికి న్యాయం చెయ్యదు. వాడి భవిష్యత్తుకు రాణింపునివ్వదు. '...అది లోకరీతి. దానిని తప్పుపట్టనక్కరలేదు. నీ కొడుకైనా ప్రయోజకుడడైతే...' తల్లి హెచ్చరిక గుర్తులోనే వుంది.

"నేనర్థం చేసుకుని ఏం ప్రయోజనం. ఇంకా చాలా లోకం వున్నది. అది మనల్ని గుర్తించదు. గౌరవించదు" అంటుంటే ఆమె గొంతు దుఃఖంతో పూడిపోయింది.

అతను ఆమెను చూడకుండా తల ప్రక్కకు తిప్పుకున్నాడు ఇబ్బందిగా. "ఎవరి జీవితం వారిది. మనల్ని మనం గుర్తించుకోవడం, గౌరవించుకోవడం ముఖ్యం కాళింది" అన్నాడు.

అతని ధోరణి ఆమెకు కొత్త కాదు. అతనివ్వగల సమాధానం ఆమెకు బాగానే తెలుసు. ఆమె అతని సహచరి.

ఆమె బాధ అతనికి తెలుసు "నాకు మరోవిధంగా వుండటం చాతకాదు... ఇహ నేను ఇంతే..." సంజాయషీ చెబుతున్నట్లు ఆగిఆగి నెమ్మదిగా గొణిగాడు.

ఆ మాటలకు ఆమెకు బాధ కలిగింది. ఇది అతని తీరు కాదు. ఏదీ అతని గాంభీర్యం? పొరపాటు చేసినట్లు బాధపడుతున్నాడా? దేనికి సంజాయిషీ చెబుతున్నాడు?

ఆలోచనల ఆటుపోటుల వెనుక సుప్తంగా వుండిపోయిన ఆత్మీయత, అభిమానం వెల్లువై బయటకొచ్చాయి. లోకంతో పరుగులు, ఆ విలువలు తాను గౌరవించినవి కావన్న నిజమూ గుర్తుకొచ్చింది. దేని వలన జీవితానికి సారమూ, పవిత్రత ఏర్పడి సార్థకమవుతుందో, దేనివలన మనస్సు తన పోకడలోని ద్వంద్వస్వభావాన్ని అధిగమించి ఏకోన్ముఖం అవుతుందో ఆ ఉన్నతి గోచరించింది.

"మీకు కనిపిస్తున్న వెలుగులో మీరు నడుస్తున్నారు... అది ఈ కాలపు వెలుగు కాదండీ... అయినా ఫరవాలేదు... ప్రపంచం విశాలమైనది. శశి బ్రతకడానికి ఏదో వొక మార్గం ఏర్పడుతుంది." నమ్మకంగా చెప్పింది కళ్ళు తుడుచుకుంటూ.

కిటికీ బయటంతా సందడి. వాకిటి ముందు గడ్డిలో చిన్న ముక్కుల్తో కెలుక్కుంటూ కివ్ కివ్‌మంటూ హడావిడి చేస్తున్న పిచుకల్నీ, రోడ్డులో గంటలు గణగణలాడిస్తూ పరిగెడుతున్న రిక్షాల్నీ, నవ్వుకుంటూ, కబుర్లు చెప్పుకుంటూ నడుస్తున్న మనుషుల్నీ-అన్నీ చూపులో ఆకళించుకుంది కాళింది. కల్యాణం అన్న పదం స్ఫురణలోకి వచ్చింది.

"మంచిపంతులే మీరు! ప్రతి సమస్యకూ వొకసమాధానం నమ్మకంగా చెప్తారు!" నవ్వుతూ అనేసి, వంట ప్రారంభించడానికి తొందరపడుతూ వెళ్ళిపోయింది కాళింది.

★★★

"If a man does not keep pace with his companions
perhaps it is because he hears a different drummer.
Let him step to the music he hears, however
measured or far away"

**DAVID HENRY THOREAU**